క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ

అవనిగడ్డ: గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించినా పుస్తకాలకున్న ప్రాధాన్యత మరువరాదన్నారు. పుస్తక పఠనంతో మానసిక ప్రశాంతత, ఆత్మస్థైర్యం పెంపొందడంతో పాటు ఒత్తిడిని అధిగమించ వచ్చన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, గ్రంథాలయ అధికారి జుజ్జువరపు ప్రభుదాస్, వైఎస్సార్ సీపీ నాయకులు మద్ది చిన్నా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాలుష్య రహిత దీపావళి

పెడన: పట్టణంలోని సెయింట్ విన్సెంట్ పల్లోటి స్కూల్‌లో శుక్రవారం ప్రకృతి సహిత దీపావళిని ఘనంగా నిర్వహించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి తెలిపారు. నేల తల్లికి హాని కలిగించే బాణసంచాను వినియోగించకుండా ప్రకృతి సహజసిద్ధమైన పద్ధతులలో దీపావళిని జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ, ప్రకృతి సిద్ధమైన దివిటీలు, వివిధ రకాల ప్రమిదలు వెలిగించి ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ రాజీవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14న మండల పరిషత్ సమావేశం

మోపిదేవి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 14న మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. అధికారులు సంబంధిత సమాచారంతో హాజరు కావాలన్నారు.

బదిలీపై వెళ్లిన సుబ్బారావుకు సన్మానం

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల ఎంపీడీఓగా పనిచేస్తూ గుడివాడ డీఎల్‌డీఓగా పదోన్నతిపై వెళ్లిన కేవీ సుబ్బారావును శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు డీఎల్‌డీఓ సుబ్బారావును సన్మానించి అభినందించారు. రిటైర్డ్ ఈఓపీఆర్‌డీ దాసి సీతారామరాజు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ

మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆస్పత్రి ఉద్యోగ దరఖాస్తుదారులతో శుక్రవారం కిటకిటలాడింది. సర్వజన ఆస్పత్రితో పాటు ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలల్లో పనిచేసేందుకు 17 రకాల ఉద్యోగాల భర్తీకి అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. దరఖాస్తు గడువు ఆదివారంతో ముగియనుండటంతో దరఖాస్తులు అందించేందుకు అభ్యర్థులు తరలివస్తున్నారు. ఆస్పత్రిలోని మీటింగ్‌హాల్‌లో దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ ఏర్పాటు చేశారు. గురువారం ఒక్క రోజే రెండు వేలకు పైగా దరఖాస్తులు రాగా శుక్రవారం కూడా అలానే వచ్చి ఉంటాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు.

ముగ్గురు ఏపీపీల నియామకం

చిలకలపూడి(మచిలీపట్నం): మూడు జిల్లా కోర్టులకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, ఎస్సీ, ఎస్టీ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కమ్మగంటి చంద్రశేఖరరావు, ఆరవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏపీపీగా ఆరెపు వెంకటేశ్వరరావు, తొమ్మిదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏపీపీగా చలమలశెట్టి వెంకటేశ్వరరావు (కొండ)ను నియమించారు.

శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

కోనేరుసెంటర్: నేల స్వభావాన్ని బట్టి వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇచ్చిన సలహా మేరకు రైతులు పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జన్ను రాఘవరావు అన్నారు. అరిసేపల్లి గ్రామంలో విత్తన దినోత్సవం సందర్భంగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనా స్థానంలో రైతులకు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. గిరిజారాణి మాట్లాడుతూ వరి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ డెప్యూటీ డైరెక్టర్ మనోహరరావు, ఘంటసాల పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ వి. సత్య ప్రియలలిత, చెరకు పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. నాగేంద్రరావు, మండల ఆర్బీకే అధ్యక్షులు చూడామణి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం, ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్టు పద్ధతిపై సాగరమిత్ర పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్. శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఏటిపాగరు, చినగొల్లపాలెం, ఏటిమొగ, సార్లగొంది, ఎదురుమొండి, జింకపాలెం, ఈలచెట్లదిబ్బ, పల్లెతుమ్మలపాలెంలో సాగరమిత్ర నియామకం కొరకు బీఎఫ్ఎస్సీ, బీఎస్సీ (ఫిషరీస్, మెరైన్ బయాలజీ, జువాలజీ) డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు ఫారాలను వెబ్‌సైట్‌లో ఉంచామని చెప్పారు. దరఖాస్తులను రిజిస్టర్ పోస్టు ద్వారా గాని, స్వయంగా గాని ఈ నెల 22వ తేదీలోగా మచిలీపట్నంలోని మత్స్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

జగన్ పాలనలో సంక్షేమ విప్లవం

- వాస్తవాలు వివరించేందుకే 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సీతనపల్లిలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన నాయకులు



పెడనలో ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాగకుమారి తదితరులు



నాచుగుంటలో బోర్డును ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



విశ్వనాథపల్లిలో బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అవనిగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఒకటో సచివాలయంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గతంలో చంద్రబాబు హయాంలో, ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇచ్చిన హామీలు, అమలు చేసిన పథకాల వాస్తవాలను వివరించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. గతంలో 650కిపైగా హామీలిచ్చిన చంద్రబాబు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చడం ద్వారా దేశంలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని చెప్పారు. వాస్తవాలు ప్రజలకు వివరిస్తున్నామని 2024లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు సీతాయిలంక, కోటగిరిలంక గ్రామాల్లో పర్యటించి పలు ఇళ్లపై పార్టీ జెండాలను కట్టారు. చంద్రబాబు, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మేనిఫెస్టో హామీల అమలు తీరును వివరించి అభిప్రాయాలు సేకరించారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరు ముచ్చు ఉమా, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా పాల్గొన్నారు.

సీతనపల్లిలో..

కృత్తివెన్ను: సీతనపల్లి సచివాయం పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ ఏర్పాటు చేసిన బోర్డును నాయకులు ఆవిష్కరించారు. భవిష్యత్‌లో ఇంతకు మించి అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రిగా రావాలని నాయకులు కోరారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, మండల అధ్యక్షుడు వెంకట్రాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్, జేసీఎస్ మండల కన్వీనర్ బాపూజీ, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మోజీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఎంతో మేలు..

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు ఎంతో మేలు జరిగిందని, మళ్లీ జగనే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పలువురు తెలిపారు. పెడన రెండో సచివాలయం పరిధిలో 4, 5, 6 వార్డులకు, మండలంలోని చెన్నూరు గ్రామ సచివాలయం వద్ద ఆయా సచివాలయాల్లో సైన్‌బోర్డులను, పార్టీ జెండాలను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, పార్టీ పట్టణ కన్వీనర్ మల్లి, సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్, కౌన్సిలర్లు రెహతున్నీసా, బాబులాల్, ముత్యాల మురళి, కోడూరు శ్రీను, టీపీఓ ఏసుబాబు, నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

పెడన మండలం చెన్నూరు గ్రామ సచివాలయంలో సైన్‌బోర్డును ఎంపీపీ రాజులపాటి వాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆవిష్కరించారు. మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, రామానాయుడు, సచివాలయ కన్వీనర్ బెజవాడ నాగబాబు, దావు భైరవలింగం, వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బల్లిపర్రులో ..

పెడన: బల్లిపర్రులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. గరికపాటి వెంకట రామానాయుడు, దావు భైరవలింగం, లోయ ఆంజనేయులు, పామర్తి సాంబశివరావు, యాదంరెడ్డి ప్రసాదరావు పాల్గొన్నారు. పెడన ఒకటో వార్డులో నియోజకవర్గ పరిశీలకులు గోరిపర్తి రవికుమార్, బళ్ల గంగయ్య, పట్టణ కన్వీనర్ బందారు మల్లి, వార్డు కౌన్సిలర్ బి. పద్మ, సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్ గడప గడపకు వెళ్లి కరపత్రాలను అందజేసి సీఎం ఎందుకు కావాలి అనే విషయాన్ని ఆయా కుటుంబ సభ్యులకు వివరించి వారి ఆమోదంతో సంతకాలు తీసుకున్నారు.

జగనన్న పాలనలో పచ్చగా పల్లె సీమలు..

నాచుగుంట(నాగాయలంక): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధితో పాటు పల్లెసీమలు పచ్చగా విరాజిల్లుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మండలంలోని దీవి గ్రామం నాచుగుంట సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో నాగాయలంక జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, పార్టీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు మాట్లాడారు. తొలుత సచివాలయ ప్రాంగణంలో ప్రభుత్వ పథకాల బోర్డును ఆవిష్కరించారు. సూపరింటెండెంట్ రామ్‌కుమార్, ఈఓపీఆర్‌డీ కె.అప్పల నరసమ్మ, ఎంపీటీసీ కొల్లు యానాదిరావు, మోకా నాగప్రసాద్, ఫిషరీస్ చైర్మన్ సైకం నాగరాజు, పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం..

బోడుగుంట(మోపిదేవి): పేదలకు ఎంతో మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని పలువురు వక్తలు అన్నారు. మోపిదేవి–2 సచివాలయం పరిధిలో బోడగుంట దళితవాడలో సర్పంచ్ నందిగం మేరీరాణి, మండల నోడల్ అధికారి కె. రాజ్‌కుమార్ డిస్ ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రావి రాంప్రసాద్, రత్నశ్రీ, మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, గ్రామ కన్వీనర్ కారుమూరి తాతయ్య, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్వనాథపల్లిలో..

కోడూరు: విశ్వనాథపల్లి గ్రామంలో సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, సర్పంచి కొప్పనాతి శేషుబాబు, ఈఓపీఆర్డీ నాగరేవతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి..

కోడూరు: విశ్వనాథపల్లిలో పార్టీ పతాకాన్ని నేతలు ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలకు కలిగిన లబ్ధి, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని గ్రామస్తులకు వివరించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డినే గెలిపించాలని కోరారు. పార్టీ నేతలు రాత్రికి గ్రామంలో బస చేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, సర్పంచి కొప్పనాతి శేషుబాబు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కంచడం, బ్రహ్మపాడులో..

బంటుమిల్లి: మండల పరిధి కంచడం, బ్రహ్మపాడు గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నరేళ్లలో సుమారు రూ.21 కోట్లను పలు అభివృద్ధి పథకాలకు ఖర్చుచేసిందని ఎంపీడీఓ జె. స్వర్ణభారతి తెలిపారు. కంచడం సచివాలయం వద్ద సర్పంచ్ బండారు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం నాయకులు గ్రామంలో పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీటీసీ భగవాన్, పీఏసీఎస్ చైర్మన్ శేషగిరి, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబూరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు: గూడూరు–2 గ్రామ సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును నాయకులు ఆవిష్కరించారు. అనంతరం మచిలీపట్నం– విజయవాడ జాతీయ రహదారిపై గూడూరు కూడలిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుంచి ప్రదర్శనగా పటాన్‌పేట అంబేడ్కర్ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి గత పాలనకు, జగనన్న పాలనకు వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, సర్పంచి లింగం సులోచనారాణి, మండల కన్వీనర్ పర్లం మహాలక్ష్మయ్య నాయుడు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో..

చల్లపల్లి: లక్ష్మీపురం గ్రామ సచివాలయం–2 పరిధిలో గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను మండల పార్టీ అధ్యక్షులు శీరం వెంకట సత్యనారాయణ (నాని) ఆవిష్కరించారు. గ్రామ సచివాలయ ప్రాంగణంలో సంక్షేమ పథకాల బోర్డును సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కల్యాణి, ఎంపీటీసీ సభ్యులు మోపిదేవి ద్వారకానాథ్, నూకల వెంకటేశ్వరరావు, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

చిన్నాపురంలో..

కోనేరుసెంటర్: వచ్చే ఎన్నికల్లో సైతం జగనే రావాలి.. జగనే కావాలి అని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. మండల పరిధిలోని చిన్నాపురంలో పార్టీ జెండాను ఎగురవేసి సచివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ముఖ్యమైన నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గ ఇన్‌చార్జి శొంఠి ఫరీద్, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు జన్ను రాఘవరావు, తోట శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, వెంకూ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ భరోసా



బందరు సభలో మాట్లాడుతున్న పేర్ని కిట్టు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే ప్రజలకు సంక్షేమ భరోసా లభిస్తుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 49వ డివిజన్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పేర్ని కిట్టు మాట్లాడుతూ జగన్ పాలనలో అమలు చేసిన పథకాలతో పేదల జీవితాల్లో ఎంతో మార్పు వచ్చిందని చెప్పారు. అన్నివర్గాలకు ప్రభుత్వ పథకాలు అందజేశారని వివరించారు. గత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సివచ్చేదని గుర్తుచేశారు. అవినీతి లేని సంక్షేమ పాలన కావాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను, డివిజన్‌లో జరిగిన అభివృద్ధి వివరాల బోర్డును మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పార్టీ జెండాలను కట్టారు. మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, డివిజన్ కార్పొరేటర్ పి. సింహాచలం, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా రికార్డులు సిద్ధం చేయండి

టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు



చిలకలపూడి(మచిలీపట్నం): ఫొటో ఓటర్ల జాబితా పరిశీలకులు త్వరలో జిల్లాకు రానున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది సంబంధిత రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా, క్షేత్ర స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల జాబితా పరిశీలన, సవరణ కార్యక్రమం, భూముల రిజిస్ట్రేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫొటో ఓటర్ల జాబితా పరిశీలనకు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక అధికారులుగా నియమించిందన్నారు. వారు త్వరలో జిల్లాకు రానున్న నేపథ్యంలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బూత్ స్థాయి సిబ్బంది ఫొటో ఓటర్ల జాబితాకు సంబంధించిన దరఖాస్తులు, ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులకు సంబంధించిన అన్ని రికార్డులను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గన్నవరం, మచిలీపట్నం, పెనమలూరు నియోజకవర్గంలో ఒకే ఇంటి నంబర్‌తో ఎక్కువ ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం గుర్తించి వివరాలు పంపిందని, వాటిని ఒకసారి క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవంగా ఉన్నారో, లేదో విచారించి ఓటర్ల జాబితాను సరిచేయాలని సూచించారు. ఏడాదిగా భూమి రికార్డులు, భూ సర్వేల్లో చాలా మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రెండు నెలలుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గ్రామ, వార్డు సచివాలయాల్లో జరుగుతోందన్నారు. ఇందుకోసం సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. 20 సంవత్సరాలుగా 22ఎ లో ఉన్న భూములను ఆ పరిధిలో నుంచి తొలగించి ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. దీని ప్రకారం 600లకు పైగా లబ్ధిదారులకు 33 గ్రామాల్లో 637 ఎకరాల భూమిని 22ఎ పరిధి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఈ ఉత్తర్వులను రిజిస్ట్రేషన్ శాఖకు పంపుతామని చెప్పారు. భూ హక్కుదారుడు ఎవరైనా సరే రిజిస్ట్రేషన్ కోసం వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వ విధానం ప్రకారం రిజిస్ట్రేషన్ జరపాలన్నారు. ఈ నెల 14వ తేదీన నిర్వహించే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురించి ప్రజాప్రతినిధులు, ఏలూరు, ఎన్‌టీఆర్ జిల్లాల కలెక్టర్ల కార్యాలయాలకు సమాచారం అందించారా, లేదా అని జెడ్పీ సీఈఓను అడిగి తెలుసుకున్నారు.

వ్యవసాయ సలహా మండలి సమావేశం

మోపిదేవి: రైతులకు పలు రకాల వ్యవసాయ పరికరాలు అందించి ప్రభుత్వం ఆదుకుంటోందని వ్యవసాయ శాఖ ఏడీఏ జేఎస్ జయప్రద అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ సబ్సిడీపై టార్పాలిన్ పట్టాలు, ధాన్యం కొనుగోళ్లను వివరించారు. తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఏఓ షెబ్బిబారాణి, మండల సలహా మండలి అధ్యక్షుడు మత్తి వెంకట సత్యనారాయణ, హెచ్ఓ, ఏఏబీ సభ్యులు, రెవెన్యూ వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

అకౌంటింగ్ డేపై సెమినార్

బంటుమిల్లి: దేశంలో ప్రజల మనుగడలో వాణిజ్యం (వ్యాపార లావాదేవీలు) ఓ భాగమైందని బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జగన్‌మోహనరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో అకౌంటింగ్ డే సెమినార్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రజలతో పాటు ఆర్థిక లావాదేవిలు పెరుగుతుండటంతో వాణిజ్యం ఓ భాగమైందని, ఇది ప్రముఖ పాత్ర పోషిస్తోందని చెప్పారు. విద్యార్థులకు జీవనోపాధి కల్పించడంలో వాణిజ్య శాస్త్రం ముఖ్య భూమిక వహిస్తోందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులిగడ్డలో వైఎస్సార్ సీపీ జెండా దహనం

ఖండించిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



ఎస్ఐ రమేష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డ శివారు పాతకోటలో గుర్తుతెలియని వ్యక్తులు వైఎస్సార్ సీపీ జెండాను తగుల బెట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. పులిగడ్డ శివారు పాతకోటలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరిగింది. పాతకోటలోని పాత ఎత్తిపోతల పథకం పక్కన వైఎస్సార్ సీపీ జెండాను నాయకులు ఎగురవేశారు. రాత్రికి రెసిడెన్షియల్ స్కూల్ సమీపంలోని చర్చిలో బస చేశారు. తెల్లారిన తరువాత వైఎస్సార్ సీపీ జెండా పైపునకు చిలకలపూడి పాపారావు బొమ్మ ఉన్న జనసేన జెండా కనిపించింది. దగ్గరలోనే పిచ్చిచెట్ల మధ్య వైఎస్సార్ సీపీ జెండా తగులబెట్టి ఉండటాన్ని గమనించి వైఎస్సార్‌సీపీ శ్రేణులు కోపోద్రిక్తులయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించి తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న అవనిగడ్డ నియోజకవర్గంలో గొడవలు, అల్లర్లు సృష్టించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రతిపక్ష పార్టీలు ప్రయత్నిస్తున్నాయన్నారు. నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ ఎగురవేసిన పైపునకు జనసేన జెండా కాకుండా మత్స్యకార నేత చిలకలపూడి పాపారావు, పవన్ కల్యాణ్ బొమ్మలు ఉన్న జెండాను పెట్టడం వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. మత్స్యకార సామాజిక వర్గానికి, వైఎస్సార్ సీపీకి మధ్య గొడవలు పెట్టాలనే దురుద్దేశంతోనే ఈ చర్యకు పాల్పడ్డారని ఎమ్మెల్యే సింహాద్రి విమర్శించారు. తాను ఎప్పుడూ శాంతిని కోరుకుంటానన్నారు. ఎస్ఐ రమేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నాగాయలంక జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ దాసరి విజయకుమార్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, నాగాయలంక మండల సచివాల కన్వీనర్ మద్ది చిన్నా, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ బాషా, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు నాగాయలంక విద్యార్థినులు

నాగాయలంక: జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు మత్తి వెంకట లిప్సిక, తరకటూరి లాస్యసాయి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం కసిరెడ్డి శాంతకుమారి శుక్రవారం తెలిపారు. గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 9న జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో 130 ప్రాజెక్టులను ప్రదర్శించగా ఏడు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ఇందులో నాగాయలంక విద్యార్థినులు ప్రదర్శించిన అన్ ఆయుర్వేదిక్ వే టూ డయాబెటిక్ క్యూర్ అనే ప్రాజెక్టు పలువురి ప్రశంసలు అందుకుని విజేతగా నిలిచింది. గుడివాడ డీవైఈఓ పద్మారాణి చేతుల మీదుగా వీరు సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈనెల 28న గుంటూరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్‌లో లిప్సిక, లాస్యసాయి పాల్గొంటారని శిక్షణ ఇచ్చిన టీచర్ కొమ్మినేని ఉదయకుమార్ చెప్పారు. గైడ్ టీచర్, బాలికలను పలువురు అభినందించారు.

పెనుమల్లి విద్యార్థుల ప్రతిభ

పెడన: రాష్ట్ర స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు పెనుమల్లి విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైందని పెనుమల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయిని జీవీ విజయకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి పోటీలకు పెడన మండలం పెనుమల్లి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు కాగిత పవన్ కుమార్, వుట్ల చరణ్ రూపొందించిన 'ఫెంటాస్టిక్ లాంటానా' అనే ప్రాజెక్ట్ ఎంపికైందన్నారు. లాంటానా (తలంబ్రాలు మొక్క) కాండం, పత్రాలు (ఆకులు) నుంచి కలుపు సంహారకాలు తయారు చేసి వాటి ద్వారా 'వయ్యారి భామ' అనే కలుపు మొక్కను నివారించుట ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు. గుడివాడ డీవైఈఓ పద్మారాణి చేతుల విద్యార్థులు మీదుగా బహుమతులు అందుకున్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి : డీఎస్పీ మురళీధర్

కోడూరు: ప్రజలకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం కోడూరు పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. క్రైమ్ రేట్ తగ్గించేందుకు అనుసరించాల్సిన అంశాలపై డీఎస్పీ చర్చించారు. ఏడాది వ్యవధిలో నమోదైన బైండోవర్ కేసులు, ఎఫ్ఐఆర్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ స్థాయిలో మహిళా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి సమాచారాన్ని ఎప్పటికప్పుడు స్టేషన్‌కు అందించాలని డీఎస్పీ సూచించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ స్థాయిలోని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని చెప్పారు. అనంతరం ఆలయంలో మొక్కలు నాటారు. సీఐ రమేష్, ఎస్ఐ రాజేంద్రప్రసాద్, ఏఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను ఇబ్బందులు పెడుతున్న కేంద్రం

డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి విమర్శ

మచిలీపట్నంటౌన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురిచేస్తోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వింత సంజీవరెడ్డి అన్నారు. స్థానిక డీసీసీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని నియంతలా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలను ఇబ్బందులపాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ పరిస్థితిలో దేశానికి కాంగ్రెస్ పార్టీ ఒక్కటే రక్షణ కల్పిస్తుందన్నారు. రాహుల్‌గాంధీ జోడో యాత్ర అనంతరం దేశంలో రాజకీయ పరిస్థితుల్లో మార్పులు కనబడుతున్నాయని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ వస్తేనే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు అబ్దుల్‌మతీన్, కోకా ఫణిభూషణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్ఞాపికలు అందజేత

మచిలీపట్నంటౌన్: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు శుక్రవారం ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. మచిలీపట్నం డీవైఈఓ యూవీ సుబ్బారావు వీటిని విద్యార్థులకు అందజేశారు. 43 విద్యాసంస్థల పరిధిలో 196 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ టి. శ్రీనివాసరావు, యూఎస్ఏ సాయి భక్తుడు ఎల్. కుటుంబరావు, సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, సమితి కన్వీనర్ పి. ఆంజనేయకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సృజనాత్మక పోటీలు

కోడూరు: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో విద్యార్థులకు సృజనాత్మక పోటీలు నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. 1, 2 తరగతుల విద్యార్థులకు స్పెల్–బీ పోటీలు, 3 నుంచి 8వ తరగతి వరకు టాలెంట్ టెస్టు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 450 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని ఎంఈఓ టీవీఎం రామదాసు వివరించారు.